
సాక్షి
గుంటూరు
గురువారం । 4 । జూలై । 2024



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 513.90 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.



అట్రాసిటీ కేసులపై శ్రద్ధ పెట్టాలి

నెహ్రూనగర్: ఎస్సీ ఎస్టీ కేసులపై శ్రద్ధ పెట్టాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ళ అరుణ్ కుమార్ బుధవారం సచివాలయంలో హోం మంత్రి వంగలపూడి అనితను కోరారు.



180 మందికి వైద్యపరీక్షలు

ఫిరంగిపురం: రేపూడిలో బుధవారం ఫిరంగిపురం పీహెచ్సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యురాలు శ్వేత 180 మందికి వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు.

న్యూస్‌రీల్

గుంటూరు తూర్పులో 14.6 మి.మీ. వర్షం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు అత్యధికంగా గుంటూరు తూర్పులో 14.6 మిల్లీ మీటర్ల వర్షం పడగా, అత్యల్పంగా తాడేపల్లి మండలంలో 1.4 మి.మీ వర్షం పడింది. సగటున 4.9 మి.మీ వర్షపాతం నమోదైంది. మండలాలవారీగా ఫిరంగిపురం 13.2 మి.మీ., గుంటూరు పశ్చిమ 11, తెనాలి 10.8, కొల్లిపర 10.2, దుగ్గిరాల 7.8, పెదకాకాని 7.2, తుళ్ళూరు 5.4, మేడికొండూరు 3.2, మంగళగిరి 1.8, చేబ్రోలు మండలంలో 1.6 మి.మీ. చొప్పున వర్షం పడింది.

నేడు విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

ఏఎన్‌యూ(గుంటూరు): ఉన్నత విద్యా రంగంలో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 4న నిర్వహిస్తున్న విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. బంద్ నోటీసును ఎస్ఎఫ్ఐ నాయకులు బుధవారం యూనివర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య సంధ్యా కొలేకి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ స్టేట్ కమిటీ సభ్యురాలు నమిత మాట్లాడుతూ పీహెచ్‌డీ ప్రవేశానికి నెట్ స్కోరింగ్ విధానాన్ని రద్దు చేయాలని, నెట్ పరీక్ష పేపర్ లీకేజ్ వల్ల ఎంతో మంది విద్యార్థులు నష్టపోతున్నారని, వన్ నేషన్-వన్ ఎగ్జామ్ ముసుగులో మొత్తం పరీక్ష వ్యవస్థ కుప్ప కూలిందని ఆరోపించారు.

కమ్యూనికేషన్ కార్యాలయం ప్రారంభం



నరసరావుపేట రూరల్: జిల్లాలో పోలీస్ కమ్యూనికేషన్ వ్యవస్థ పటిష్టంగా ఉండాలని పల్నాడు ఎస్పీ మలికా గార్గ్ తెలిపారు. నరసరావుపేట రూరల్ పోలీస్‌స్టేషన్ కాంపౌండ్‌లోని ఆధునీకరించిన జిల్లా కమ్యూనికేషన్ కార్యాలయాన్ని బుధవారం ఎస్పీ ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా అడ్మిన్ ఎస్పీ ఆర్.రాఘవేంద్ర, క్రైమ్ అడిషనల్ ఎస్పీ ఎస్.లక్ష్మీపతి, ఏఆర్ డీఎస్పీ గాంధీ, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు బి.సురేష్‌బాబు, యు.శోభన్‌బాబు, కమ్యూనికేషన్ ఇన్‌స్పెక్టర్లు పి.చిన్నవెంకటేశ్వర్లు సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత బ్యాగ్‌లు పర్యావరణహితం

పల్నాడు జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి

నరసరావుపేట ఈస్ట్: పర్యావరణానికి ప్రమాదకరమైన ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లను వినియోగించవద్దని పల్నాడు జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ రవి తెలిపారు. అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం సందర్భంగా సత్తెనపల్లికి చెందిన హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నానో వేవ్ బ్యాగ్‌లను బుధవారం తన కార్యలయంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్లాస్టిక్ రహిత సంచులను వినియోగించటం ద్వారా ప్లాస్టిక్ ప్రళయాన్ని తగ్గించి పర్యావరణ సమతుల్యాన్ని కాపాడవచ్చని వివరించారు. కూరగాయలు, ఆకుకూరల్లో సైతం ప్లాస్టిక్ కణాలను శాస్త్రవేత్తలు గుర్తించారని తెలిపారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, సభ్యుడు మురళీకృష్ణ పాల్గొన్నారు.

యార్డుకు 42,587 బస్తాల మిర్చి రాక



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 42,587 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 41,920 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ. 16,800 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 19,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,500 నుంచి రూ. 17,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,000 నుంచి రూ. 19,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 18,775 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సకాలంలో విత్తనాలు

- గ్రామీణాభివృద్ధికి కృషి
- కలెక్టర్ నాగలక్ష్మి వెల్లడి
- ఆర్బీకే, పాఠశాలలు తనిఖీ



మాచవరం గ్రామంలో రైతుకు విత్తనాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

పొన్నూరు: ఖరీఫ్ సాగు కోసం రైతులకు సకాలంలో విత్తనాలు అందేలా చర్యలు చేపడతామని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి చెప్పారు. బుధవారం మండలంలోని మామిళ్లపల్లి, పచ్చల తాడిపర్రు, మాచవరం గ్రామంలో పర్యటించారు. ముందుగా పచ్చలతాడిపర్రులో 50 శాతం సబ్సిడీతో ఇచ్చిన పచ్చిరొట్ట విత్తనాలతో పండించిన పొలాన్ని వ్యవసాయ అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పొలాలకు సాగు నీరందించే శ్రీరంగపురం కాలువ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని రైతులు కోరారు. మామిళ్లపల్లి గ్రామంలో ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థులను పలకరించారు. ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. పాఠశాలలో విద్యార్థులతోపాటు మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం నాణ్యతపై నిర్వాహకులకు సూచనలు ఇచ్చారు. గ్రామంలోని పాఠశాలలో పదో తరగతి వరకు బోధించాలని సర్పంచ్ జాలాది యానాదిరావు కలెక్టర్‌ను కోరారు. పరిశీలించి చర్యలు చేపడతామని కలెక్టర్ చెప్పారు. మాచవరంలో రైతు భరోసా కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. అనంతరం రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులను అందించారు. అందరికీ విత్తనాలు అందేలా చర్యలు చేపడతామని, మరో 40 క్వింటాళ్ల అదనపు వరి విత్తనాల కోసం అధికారులకు ప్రతిపాదనలు పంపామని కలెక్టర్ నాగలక్ష్మి వివరించారు. అనంతరం కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో విత్తనాల కొరత లేకుండా చూస్తామని వెల్లడించారు. పంట కాల్వల అభివృద్ధికి చర్యలు చేపడతామని వివరించారు. కౌలు రైతులకు రుణాలు అందేలా చూస్తామని పేర్కొన్నారు. వ్యవసాయానికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టం చేశారు. సాగుకు నీరందిస్తామని, గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.వెంకటేశ్వర్లు, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.వెంకటేశ్వర్లు, పశుసంవర్థక శాఖ డెప్యూటీ డైరెక్టర్ సత్యనారాయణ, డీఈఓ పి.శైలజ, ఏడీఏలు వెంకటరామయ్య, రామకోటేశ్వరి, విలేజ్ అగ్రికల్చర్ అధికారి సమజ, తిరుపతమ్మ, ఎంఈఓలు తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు ఉచితంగా చేయాలి

- కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశం
- చేబ్రోలు ఆరోగ్య కేంద్రంలో ఆకస్మిక తనిఖీ



చేబ్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

చేబ్రోలు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు ఉచితంగా చేయాలని, రోగులను బయటకు పంపరాదని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. చేబ్రోలులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని వార్డులను, ల్యాబ్‌ను పరిశీలించారు. రికార్డులను పరిశీలించి నిర్వహణపై సూచనలు చేశారు. వైద్యాధికారులు, సిబ్బందితో, రోగులతో మాట్లాడారు. హైరిస్క్ కాన్పులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్యులకు సూచించారు. మాతా, శిశు మరణాలు సంభవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులకు సరైన చికిత్స అందించాలని సూచించారు. రాత్రి పూట వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవటం వల్ల కొంత ఇబ్బందిగా ఉందని రోగులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. రాత్రి పూట నర్స్, హెడ్ నర్స్ తప్పక డ్యూటీలో ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్, డీఎంఅండ్‌హెచ్‌ఓ విజయలక్ష్మి, డెప్యూటీ డీఎంహెచ్‌వో అన్నపూర్ణ, స్థానిక వైద్యాధికారులు అబ్రహం లింకన్, శైలజ, లక్ష్మీ కుమారి, వందనం తదితరులు పాల్గొన్నారు.



సాగుచేస్తున్న పత్తిపంట

ఆదిలోనే నీరుత్సాహం

కష్టాలలో ఖరీఫ్

- ప్రాజెక్టుల్లో నీటి జాడేదీ!
- అడపాదడపా వర్షాలతో సరి!
- నీటి విడుదలపై అయోమయం
- జిల్లాలో ఐదు శాతం విస్తీర్ణంలోనూ మొదలు కాని సాగు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఖరీఫ్ సాగు కష్టాల్లో కూరుకుపోతోంది. సాగునీరు వచ్చే అవకాశాలు కనపడకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రాజెక్టులన్నీ ఖాళీ అయిపోవడంతో సాగుకు నీటిని విడుదల చేసే అవకాశాలు కనపడటం లేదు. దీంతో ఇప్పటి వరకూ గుంటూరు జిల్లాలో ఐదు శాతం కూడా పంటలు వేయలేని దుస్థితి కనపడుతోంది. గుంటూరు జిల్లాలో 63,733 హెక్టార్లలో వరి సాగు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 1,525 హెక్టార్లలోనూ వరి సాగు ప్రారంభం కాని దుస్థితి. మొక్కజొన్న ఐదు హెక్టార్లు, పెసలు 17 హెక్టార్లు, మినుములు 57 హెక్టార్లు, నువ్వులు 78 హెక్టార్లు, సోయాబీన్ 16 హెక్టార్లు మాత్రమే వేశారు. పత్తి విషయానికి వస్తే 26,982 హెక్టార్లలో వేయాల్సి ఉండగా ఇప్పటివరకూ 2010 హెక్టార్లలో మాత్రమే వేశారు. కూరగాయలు 439 హెక్టార్లు, పచ్చి ఎరువు 2080 హెక్టార్లలో వేశారు. జిల్లా మొత్తం మీద 1,25,914 హెక్టార్లలో పంటలు వేయాల్సి ఉండగా ఇప్పటి వరకూ 6,438 హెక్టార్లు అంటే కేవలం 5.1 శాతం మాత్రమే వేశారు. జిల్లాలో ఇతర ప్రధాన పంటలైన మిర్చి, పసుపు, ఉల్లి, టమాట పంటల సాగు ఇంకా మొదలు పెట్టనేలేదు.

డెల్టాకు నీటి విడుదలలో జాప్యం

వర్షాలు కూడా అనుకున్న స్థాయిలో కురవకపోవడంతో రైతులు పంటలు వేసేందుకు ముందుకు రావడం లేదు. మరోవైపు కృష్ణానది పరీవాహక ప్రాంతంలో వర్షాలు కురవకపోవడంతో ప్రాజెక్టులన్నీ ఖాళీగానే ఉన్నాయి. దీంతో డెల్టాకు నీటి విడుదల జాప్యం అయ్యే అవకాశం కనపడుతోంది. నాగార్జున సాగర్‌లో డెడ్ స్టోరేజి కన్నా పది టీఎంసీల నీటి మట్టం తక్కువగా ఉంది. శ్రీశైలం పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. కేవలం 37 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. ఇక పులిచింతల సామర్థ్యం 45.77 టీఎంసీలు ఉంటే ప్రస్తుతం పులిచింతలలో 0.4 టీఎంసీలు మాత్రమే ఉంది. ప్రకాశం బ్యారేజి వద్ద కూడా 3.07 టీఎంసీలకు 2.08 టీఎంసీలు ఉన్నాయి. ఈ నెలలో కృష్ణానదీ పరీవాహక ప్రాంతంలో బాగా వర్షాలు పడితే గానీ ప్రాజెక్టులు నిండి కృష్ణాడెల్టాకు నీరు ఇచ్చే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు. మరి నీటి విడుదలకు ఎన్ని రోజులు పడుతుందో వేచి చూడాలి. ఇదిలా ఉంటే పట్టిసీమ నుంచి గోదావరి నీటిని బుధవారం విడుదల చేశారు.

పాపం పసివాడు!

- అరుదైన వ్యాధి బారిన చిన్నారి
- బతకాలంటే రూ.16కోట్ల ఇంజక్షన్ అత్యవసరం
- అమెరికాలో మాత్రమే దొరికే వ్యాక్సిన్
- ప్రభుత్వ సాయం కోసం తల్లిదండ్రుల ఎదురు చూపులు
- మానవతావాదులు సాయం చేయాలంటూ వేడుకోలు



తల్లిదండ్రులతో చిన్నారి మహమద్ జియాన్

నరసరావుపేట: ఆర్నెళ్ల బాబుకి అనుకోని జబ్బు వచ్చింది. రూ.కోట్లు విలువైన ఇంజక్షన్ చేస్తేకాని తగ్గదా వ్యాధి. ఆ ఖర్చు భరించే శక్తిలేని మధ్యతరగతి కుటుంబంలో జన్మించాడా పసికందు. యావదాస్తిని అమ్మినా వైద్యం చేయించలేని స్థితిలో తల్లిదండ్రులు నిస్సహాయులుగా మిగిలారు. ప్రభుత్వం పూనుకుంటే కాని ప్రాణం నిలువని పరిస్థితి. బుధవారం సాయంత్రం వారి స్వగృహంలో తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. నరసరావుపేట నాల్గో వార్డు పనసతోటకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ షేక్ యాసిన్, షేక్ షిరీన్‌లకు గత డిసెంబరు 23వ తేదీన మగబిడ్డ జన్మించాడు. ఆ బిడ్డకు మహమద్ జియాన్ అనే పేరు పెట్టుకొని అల్లారుముద్దుగా చూసుకుంటున్నారు. నాల్గవ నెల వచ్చినా చిన్నారి తల నిలపకపోవటం, శ్వాస తీసుకోవటంలో ఇబ్బంది పడుతుండటం లాంటి లక్షణాలపై అనుమానం వచ్చిన తల్లిదండ్రులు గుంటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చూపించారు. అక్కడి వైద్యులు బాబు జన్యుపరమైన జబ్బుతో బాధపడుతున్నట్లుగా అనుమానిస్తూ హైదరాబాదుకు రిపోర్టు పంపారు. అక్కడినుంచి ఆ పసికందు స్పైనల్ మజిల్ ఎట్రోఫీ(ఎస్ఎంఏ) టైప్-1 ప్రాణాంతకమైన జబ్బుతో బాధపడుతున్నట్లుగా నిర్ధారిస్తూ రిపోర్టు ఇచ్చారు. ఈ జబ్బు ప్రపంచంలో ప్రతి పదివేలమందికి ఒకరిలో మాత్రమే వస్తుందంటూ డాక్టర్లు తెలిపినట్లు తల్లిదండ్రులు వివరించారు. సికింద్రాబాదు వెళ్లి అక్కడి వైద్యులకు మరోసారి బాబును చూపించగా, వారు కూడా అదే జబ్బుతో బాధపడుతున్నట్లుగా నిర్ధారించారు. ఈ వ్యాధికి ఇంజక్షన్ ఖరీదు రూ.16కోట్లు అవుతుందని, అదీ అమెరికాలో మాత్రమే దొరుకుతుందని వారు తేల్చిచెప్పారు. దీనిపై గత నెలలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు నాయుడుని, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్‌లను కలిసి తల్లిదండ్రులు విన్నవించారు. ప్రభుత్వం నుంచి ఇంకా నిర్ణయం వెలువడాల్సివుంది. ప్రభుత్వసాయం తప్ప తమకు దిక్కులేదని తల్లిదండ్రులు వాపోతున్నారు. మానవతావాదులు స్పందించి తమకు సహాయం చేసి ఆదుకోవాలని వారు కోరుతున్నారు. సహాయం చేయాలనుకునేవారు షేక్ యాసిన్, సెల్ నంబరుకు 91778 34384 గూగుల్ పే, ఫోన్ పేల ద్వారా గాని, వ్యక్తిగతంగాను కలిసి సహాయం చేయాలని కోరుతున్నారు.

కుమార్తెకు వీడ్కోలు పలికి వస్తూ మృత్యుఒడికి..

కారు అదుపుతప్పి డివైడర్‌కు ఢీకొని తండ్రి మృతి .. వియ్యంకుడికి స్వల్ప గాయాలు



వెంకట్రామిరెడ్డి మృతదేహం

సత్తెనపల్లి: కుమార్తె కుటుంబాన్ని అమెరికా పంపించి వస్తూ తండ్రి అనంత లోకాలకు వెళ్లిపోయిన ఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం ఎన్నాదేవి వద్ద బుధవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. సత్తెనపల్లి మండలం కట్టావారిపాలెం గ్రామానికి చెందిన గొట్టిముక్కల వెంకట్రామిరెడ్డి (55), రాజ్యలక్ష్మి దంపతులకు ముగ్గురు కుమార్తెలు. వారు ఉన్నత చదువులు పూర్తి చేసి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తున్నారు. పెద్దకుమార్తె దీప్తి, రెండవ కుమార్తె ఉషలకు వివాహాలు కావడంతో వారిరువురూ అమెరికాలో స్థిరపడ్డారు. మూడవ కుమార్తె తేజ అవివాహిత. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో దీప్తి తన కుమార్తె యువాన్షికా రెడ్డి పుట్టిన రోజు వేడుకలు సత్తెనపల్లి మండలం కంటిపూడి గ్రామంలో గత నెల 15న జరిపేందుకు గత నెల 11న భర్త మహేష్, కుమార్తె యువన్షికా రెడ్డిలతో వచ్చారు. తిరిగి బుధవారం అమెరికా వెళ్లాల్సి ఉండటంతో దీప్తి, ఆమె భర్త మహేష్, కుమార్తె యువన్షికా రెడ్డిలను ఫ్లైట్ ఎక్కించేందుకు వెంకట్రామిరెడ్డి, కంటిపూడికి చెందిన వియ్యంకుడు తేళ్లూరి శ్రీనివాసరెడ్డి వెళ్లారు. వారిని విమానం ఎక్కించి తిరిగి కారులో వస్తుండగా సత్తెనపల్లి మండలం ఎన్నాదేవి వద్దకు రాగానే కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో వెంకట్రామిరెడ్డికి తీవ్ర గాయాలు కాగా శ్రీనివాసరెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా.. చికిత్స పొందుతూ వెంకట్రామిరెడ్డి మృతి చెందాడు. శ్రీనివాసరెడ్డికి స్వల్పగాయాలు కావడంతో ప్రాణప్రాయం నుంచి బయటపడ్డాడు. వెంకట్రామిరెడ్డి మృత దేహన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

వేట సాగదు.. పూట గడవదు

- వాతావరణ మార్పులతో మత్స్యకారులకు తప్పని ఇబ్బందులు
- సుదూర వేట సాగించినా ఫలితం శూన్యం



వేటకు వెళ్లకుండా తీరంలో నిలిపి ఉంచిన పడవలు



చేపల కోసం వలలో చూసుకుంటున్న మత్స్యకారులు

వాతావరణ మార్పులతో మత్స్యకారులకు పూట గడవని పరిస్థితి నెలకొంది. ఎన్నో ఇబ్బందులతో సముద్రంలో వేట సాగించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. సముద్రంలో సుదూర ప్రాంతం వెళ్లినప్పటికి వాతావరణంలో వచ్చిన మార్పులతో ఒట్టి చేతులతో తిరిగి వస్తున్నారు. వలల్లో చేపలు పడకపోవటంతో నిరాశతో వెనక్కి వస్తున్నారు. సాధారణంగా 45రోజుల వేట నిషేధం ఎత్తివేసిన తర్వాత చేపల వేట సజావుగా సాగుతోంది. అయితే, అల్పపీడన ద్రోణితో వర్షాలు సరిగా కురవకపోవడంతో చేపలు సముద్రం నుంచి బయటకు రావడం లేదు. వేట కూడా సరిగా సాగడం లేదు. సముద్రంలో సుదూరం వెళ్లినా ఫలితం ఉండటం లేదు. డీజిల్‌కు సరిపడే విధంగా కూడా మత్స్య సంపద పడటంలేదు. ఇదే పరిస్థితి మరో నెల రోజులు పాటు కొనసాగే అవకాశం ఉందని మత్స్యకారులు వాపోతున్నారు. – బాపట్ల

జనన, మరణ ధ్రువీకరణకు బ్రేక్

- 20 రోజులుగా నిలిచిన ఆన్‌లైన్ సర్వర్
- ప్రజల ఇబ్బందులు
- అధికారుల్లోనూ అయోమయం



పనిచేయని ఆన్‌లైన్ సైట్

తెనాలిఅర్బన్: పురపాలక సంఘంలో జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ నిలిచిపోయింది. సుమారు 20 రోజుల నుంచి వెబ్‌సైట్ సర్వర్ పనిచేయకపోవడంతో సమస్య ఉత్పన్నమైంది. దీనిపై ఎవరిని సంప్రదించాలో తెలీక అధికారులు అయోమయంలో పడ్డారు. డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయ అధికారులకు ఫిర్యాదు చేసినా సరైన స్పందన లేదని సమాచారం. దీంతో జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తెనాలి పట్టణంలోని వివిధ ఆస్పత్రులలో రోజూ 15 నుంచి 20 వరకు ప్రసవాలు జరుగుతూ ఉంటాయి. అలాగే ప్రతిరోజు 12 వరకు మరణాలు సంభవిస్తుంటాయి. అంటే సగటున నెలకు తెనాలి పట్టణ పరిధిలో 450, సంవత్సరానికి 5,400 జననాలు, మరణాల విషయానికి వస్తే నెలకు 360, ఏడాదికి 4,320 సంభవిస్తుంటాయి. ఈ వివరాలను మున్సిపల్ సిబ్బంది ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెబ్‌సైట్‌లో నమోదు చేసి తర్వాత సర్టిఫికెట్‌లు జారీ చేస్తారు. అనుకోకుండా నమోదులో తప్పులు దొర్లితే వాటికి సంబంధించిన పత్రాలు తీసుకుని వాటిని సరిచేస్తుంటారు. అయితే 20 రోజుల నుంచి సర్వర్ పనిచేయకపోవడంతో నమోదులో సమస్యలు తలెత్తుతున్నాయి. సర్వర్ ఎప్పటికి అందుబాటులోకి వస్తుందో అధికారులు చెప్పలేకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆన్‌లైన్ పునరుద్ధరణకు చర్యలు



జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీకి సంబంధించిన ఆన్‌లైన్ వ్యవస్థ పనిచేయటం లేదనే విషయం తెలిసింది. ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరగా సర్వర్ పనిచేసేలా చూస్తాం. ధ్రువీకరణ పత్రాల జారీని వేగవంతం చేస్తాం.

–బండి శేషన్న, కమిషనర్, తెనాలి పురపాలక సంఘం

మంచి పౌరులుగా జీవితాలను తీర్చిదిద్దుకోవాలి

జిల్లా కారాగారంలో కొత్త చట్టాలపై అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి లీలావతి

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): భవిష్యత్‌లో ఎటువంటి నేరాలకు పాల్పడొద్దని, సమాజానికి ఉపయోగపడే పౌరులుగా జీవితాలను తీర్చిదిద్దుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) టి.లీలావతి సూచించారు. బుధవారం గుంటూరు బ్రాడీపేటలోని జిల్లా కారాగారంలో కొత్త చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీరో ఎఫ్ఐఆర్, ఎలక్ట్రానిక్స్ సమన్లు తదితర అంశాలను సమగ్రంగా వివరించారు. జిల్లా కారాగారం పర్యవేక్షణ అధికారి కె.రఘు మాట్లాడుతూ నేరాలకు పాల్పడటం అలవాటైతే కొత్త నేర చట్టాల ద్వారా తీవ్రమైన శిక్షలు విధించే అవకాశం ఉందని పేర్కొన్నారు. సదస్సులో జైలర్లు తేజేశ్వరరావు, సీహెచ్.కిరణ్, ఉప జైలర్లు కె.అశోక్, బి.శ్రీనివాసరావు, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఐ.మధుబాబు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది, పానెల్ న్యాయవాదులు కట్టా కాళిదాసు, జేబీ.ఝాన్సీ, సురేష్‌బాబు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సాహిత్య రంగంలోని వారికే ఆ పదవులు ఇవ్వాలి

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): సాహిత్య రంగంలో నామినేటెడ్ పదవులను ఆయా శాఖల్లో అనుభవం ఉన్న వారికి ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్, కార్యదర్శి ఎస్.ఎం.సుభాని బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఏపీ సాహిత్య అకాడమీ, తెలుగు అకాడమీ, అధికారభాషా సంఘం, గ్రంథాలయ పరిషత్ ఇతరత్రా సాహిత్య రంగాల శాఖల్లో నియమించనున్న రాష్ట్ర, జిల్లా చైర్మన్లను, సభ్యులను సాహిత్యేతరులతో కాకుండా జాతీయస్థాయిలో విశేష అనుభవం ఉన్న వారిని ఎంపిక చేయాలని సూచించారు. కవులు, రచయితలు, కళాకారులకు అందించే ఉగాది పురస్కారాలు, కళారత్న అవార్డులను పునఃప్రారంభించాలని కోరారు. కవులు, రచయితల పుస్తకాల ప్రచురణకు గతంలోలా భాషా సంస్కృతిక శాఖ ద్వారా ఆర్థిక సహాయం అందించేలా కృషి చేయాలని కోరారు. సాహిత్య రంగ అభివృద్ధికి ఏపీ ప్రభుత్వం పెద్దపీట వేయాలని విజ్ఞప్తి చేశారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం

సత్తెనపల్లి: లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని, లింగ నిర్ధారణ బహిర్గతం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సత్తెనపల్లి డివిజన్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి.ధర్మసింగ్ శాస్త్రి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలతోపాటు పలు స్కాన్ సెంటర్లను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ధర్మసింగ్‌శాస్త్రి మాట్లాడుతూ స్కాన్ సెంటర్ల నిర్వహణలో నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. గర్భిణులతో మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు.

కార్పొరేటర్ ధనలక్ష్మి కుటుంబానికి పరామర్శ



కార్పొరేటర్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నూరిఫాతిమా, పార్టీ నాయకులు

పట్నంబజారు: టీడీపీ ప్రభుత్వం వైఎస్సార్ సీపీ నాయకులను టార్గెట్‌గా చేసుకుని దాడులు చేయడం హేయమైన చర్య అని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా విమర్శించారు. కొద్దిరోజుల క్రితం నియోజకవర్గంలోని 8వ డివిజన్ కార్పొరేటర్ యిర్రి ధనలక్ష్మి నివాసంపై దాడి నేపథ్యంలో బుధవారం వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈసందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నేతలపై దాడులు చేస్తే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. కచ్చితంగా ప్రజలు గుణపాఠం చెప్పే రోజులు వస్తాయని హెచ్చరించారు. అన్ని వేళలా కార్యకర్తలకు అండగా ఉంటామని తెలిపారు. దాడులకు పాల్పడిన నిందితులను పట్టుకుని కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు అబ్దుల్ కర్ణుమ, యిర్రిసాయి, పోలవరపు జ్యోతి, వెంకటేశ్వరరావు, కిషోర్, చెన్నం శెట్టి బాబు, సలీం, సాగర్, అలి, సుభాని, ఫారూఖ్, సాంబ, ఆనంద్ పాల్గొన్నారు.

తెనాలిలో ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న జేసీబీ

తెనాలిఅర్బన్: బుర్రిపాలెం రోడ్డులో మున్సిపల్ అధికారులు చేపట్టిన ఆక్రమణల తొలగింపు వివాదాస్పదంగా మారింది. స్థానికులు పనులను అడ్డుకున్నారు. మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న చొరవ తీసుకుని ఆందోళనకారులతో మాట్లాడి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారు. వివరాలలోకి వెళ్తే.. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు పట్టణంలోని ఆక్రమణల తొలగింపు చేపట్టారు. దీనిలో భాగంగా బుధవారం అధికారులు జేసీబీతో బుర్రిపాలెం రోడ్డులోని ఆక్రమణలు తొలగించేందుకు వెళ్ళారు. దీనిని స్థానికులు అడ్డుకున్నారు. ఆక్రమణలన్నీ తొలగించిన తర్వాత మాత్రమే తమ దుకాణాలు తొలగించాలని భీష్మించారు. దీంతో కొద్దిసేపు ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. విషయం తెలుసుకున్న కమిషనర్ బండి శేషన్న, టుటౌన్ సీఐ సుధాకర్ అక్కడికి వెళ్ళి ఆందోళనకారులతో మాట్లాడారు. బుర్రిపాలెం రోడ్డులోని ప్రతి ఆక్రమణనూ తొలగిస్తామని, దీనిలో దేనికీ మినహాయింపు లేదని చెప్పారు. దీంతో వారు శాంతించారు. వెంటనే ఆక్రమణల తొలగింపు చేపట్టారు. కార్యక్రమంలో ఏసీపీలు సుధాకర్, సుబ్బారావు, టౌన్ ప్లానింగ్, పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైవర్లు బాధ్యతాయుతంగా డ్యూటీ చేయాలి

- డ్రైవింగ్‌లో నిర్లక్ష్యం వహిస్తే ప్రమాదాలకు అవకాశం
- ఆర్టీసీ జిల్లా రీజియన్ మేనేజర్ ఎం.రవికాంత్



కరపత్రాన్ని విడుదల చేస్తున్న ఎం. రవికాంత్

తాడేపల్లి రూరల్: ప్రమాదాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ఆర్టీసీపై ఉందని, డ్రైవర్లు బాధ్యతాయుతంగా డ్యూటీ చేయాలని ఆర్టీసీ జిల్లా రీజియన్ మేనేజర్ ఎం.రవికాంత్ అన్నారు. బుధవారం మంగళగిరి ఆర్టీసీ బస్టాండ్‌లో వర్షాకాలంలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆర్టీసీ డ్రైవర్లకు సూచనలు చేస్తూ రూపొందించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవికాంత్ మాట్లాడుతూ మంగళగిరి ఆర్టీసీ డిపోలో 2023-24 సంవత్సరానికి జీరో యాక్సిడెంట్‌గా నమోదు కావడం హర్షించదగ్గ విషయమని అన్నారు. వర్షాకాలంలో వాగులు, వంకలు, పొంగి పొర్లుతున్నప్పుడు డ్రైవర్లు తొందరపడి నీటి ప్రవాహంలోకి దించకూడదని, రోడ్డు మార్జిన్‌లో బస్సు దించేటప్పుడు నల్లరేగడి మట్టి ఉండి టైర్లు జారే ప్రమాదం ఉంటుందని చెప్పారు. డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రైవర్లు, కండక్టర్లు ప్రయాణికులతో మర్యాదగా మాట్లాడాలని పేర్కొన్నారు. ఎక్కువ మందిని ఎక్కించుకోవడం, చెయ్యి ఎత్తిన చోట బస్సును ఆపటం, వారు కోరిన చోట దించటం చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం మంత్రు నాయక్, ఆర్ఎంసీఐ నాగమణి, ఇన్‌చార్జి డీజీ నాయక్, యూనియన్ నాయకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రసకందాయంలో చిత్తూరు, కర్నూలు మ్యాచ్

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో జరుగుతున్న చిత్తూరు, కర్నూలు జట్ల మధ్య మ్యాచ్ రసకందాయంలో పడింది. ఓవర్‌నైట్ స్కోర్ 5 వికెట్ల నష్టానికి 361 పరుగులతో రెండవరోజు బుధవారం బ్యాటింగ్ ప్రారంభించిన చిత్తూరు జట్టు మరో 13 పరుగులు జోడించి 7 వికెట్లు నష్టానికి 374 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 113 పరుగులకు ఆలౌటైంది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 7 వికెట్లు నష్టానికి 146 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. అనంతరం 407 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన కర్నూలు జట్టు రెండవరోజు ఆట ముగిసే సమయానికి 2 వికెట్లు నష్టానికి 20 పరుగులు సాధించి విజయానికి 388 పరుగుల దూరంలో ఎదురీదుతోంది.

ఏటుకూరు రోడ్డులో విజిలెన్స్ తనిఖీలు



ఎరువులు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): ఏటుకూరు రోడ్డులోని యారా ఫెర్టిలైజర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ దుకాణంలో గుంటూరు రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగ అధికారులు బుధవారం విస్తృత తనిఖీలు చేశారు. వ్యవసాయ శాఖ అనుమతుల్లేకుండా ఎరువులు విక్రయిస్తున్నారనే ముందస్తు సమాచారంతో విజిలెన్స్ ఎస్పీ కె.ఈశ్వరరావు ఆదేశాల మేరకు తనిఖీలు కొనసాగాయి. స్టాక్ రిజిస్టర్‌లో నమోదైన నిల్వలకు, దుకాణంలోని నిల్వలకు తేడాలు ఉన్నట్లు గుర్తించారు. స్టాక్ బోర్డుపై స్టాక్ నిల్వలు రాయకపోవడంతో, ధరల పట్టికలో మార్పులు బయటపడ్డాయి. దుకాణ యాజమాని నిబంధనలు ఉల్లంఘించగా, రూ.2,06 లక్షల ఖరీదైన ఒక మెట్రిక్ టన్ను ఇంపోర్టెడ్ ఫెర్టిలైజర్స్ అమ్మకాలు నిలుపుదల చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ ఏఓ ఒ.రమణకుమార్, ఎస్ఐ ఎం.రామచంద్రయ్య, స్థానిక ఏఓ బి.గౌతమ్‌ప్రసన్న, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన వసతి గృహాలపై ప్రత్యేక దృష్టి సారించాలి



బి శ్రీనునాయక్

చిలకలూరిపేట: రాష్ట్రంలో ఉన్న గిరిజన వసతి గృహాల పరిస్థితి అగమ్య గోచరంగా ఉందని వాటిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఏపీ గిరిజన సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు బి. శ్రీనునాయక్ కోరారు. పట్టణంలోని ఎన్ఆర్‌టీ సెంటర్‌లో ఉన్న సంఘ కార్యాలయంలో బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహాల్లో ఏఎన్ఎంలను నియమించాలని డిమాండ్ చేశారు. గిరిజన గురుకుల పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల కొరతను సృష్టించి వారికి ఇష్టం వచ్చిన వారికి సీట్లు కేటాయిస్తున్నారని ఆరోపించారు. అలాంటి హెచ్ఎంలను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం గిరిజన నామినేటెడ్ పదవుల్లో మైదాన ప్రాంత గిరిజనులకు అవకాశం కల్పించాలని కోరారు.

సీతారామ గానసభ ఆరంభం

వైభవంగా శాస్త్రీయ సంగీత ఉత్సవాలు



డాక్టర్ ఎంవీ కమలారమణి గానాలాపన

తెనాలి: సుదీర్ఘమైన చరిత్ర కలిగిన పట్టణానికి చెందిన సీతారామ గానసభ శాస్త్రీయ సంగీత ఉత్సవాలు బుధవారం తెనాలిలో ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం 77వ సంవత్సరంలో ఈ ఉత్సవాలు జరుగుతుండటం విశేషం. దైవదత్తమైన సంగీత కళను నిస్వార్థంగా పదిమందికీ పంచాలనే భావనతో సంగీతాభిమాని నారుమంచి సుబ్బారావు 1947లో తెనాలిలో ప్రారంభించిన సీతారామ గానసభ ఒకప్పుడు ఉజ్వలంగా వెలిగింది. దక్షిణాది రాష్ట్రాల్లో ప్రఖ్యాతి చెందిన పలువురు సంగీత విద్వాంసులు ప్రతిఒక్కరూ తెనాలిలో సీతారామ గానసభ సంగీతోత్సవాల్లో కచేరీ చేసినవారే. అంతటి ప్రఖ్యాతి గాంచిన గానసభ కార్యక్రమాలు నిర్విఘ్నంగా కొనసాగేందుకు ఎందరో తోడ్పాటు నందించారు. ఈ క్రమంలో స్థానిక రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో తొలిరోజు బుధవారం సాయంత్రం 6.30 గంటల నుంచి తొమ్మిది గంటల వరకు సంగీత కార్యక్రమం జరిగింది. హైదరాబాద్‌కు చెందిన ప్రసిద్ధ సంగీత విద్వాంసురాలు డాక్టర్ ఎంవీ కమలారమణి గాత్ర కచేరీ నిర్వహించారు. వివిధ కీర్తనలకు చేసిన గానాలాపన శ్రోతలను రంజింపజేసింది. గుంటూరు చెందిన పెరవలి నందకుమార్ వయొలిన్‌పై, తెనాలి కళాకారుడు కేవీ రామకృష్ణ మృదంగంపై వాయిద్య సహకారం అందించారు. రెండోరోజైన 4వ తేదీ సాయంత్రం హైదరాబాద్‌కే చెందిన ప్రముఖ సంగీత విద్వాంసుడు వైద్యనాథన్ బాలసుబ్రహ్మణ్యం గాత్రకచేరీ ఉంటుందని గానసభ అధ్యక్ష, కార్యదర్శులు పిరాట్ల రమణి, దుర్భా హరిబాబుశాస్త్రి తెలియజేశారు. చివరిరోజైన 5వ తేదీన గుంటూరుకు చెందిన ప్రముఖ హరికథా భాగవతార్ డాక్టర్ ముప్పవరపు వెంకట సింహాచలశాస్త్రి భాగవతార్‌చే 'భక్త రామదాసు' హరికథ ఉంటుందని వివరించారు. సంగీతాభిమానులు ఆయా కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ ప్రొటెక్షన్ కౌన్సిల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా క్రిష్టఫర్



క్రిష్టఫర్‌కు నియామక ఉత్తర్వులు అందజేస్తున్న ప్రొటెక్షన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు బుల్లా రాజారావు

తాడేపల్లిరూరల్ : ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ ప్రొటెక్షన్ కౌన్సిల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దుగ్గిరాల మండలం మంచికలపూడికి చెందిన అద్దేపల్లి క్రిష్టఫర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. బుధవారం ప్రొటెక్షన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు బుల్లా రాజారావు మంగళగిరిలో తన కార్యాలయంలో క్రిష్టఫర్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా క్రిష్టఫర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా కృషి చేస్తానని పేర్కొన్నారు.

జీఎస్టీ ఉద్యోగుల సక్సెస్ మీట్

కమిషనర్ నరసింహారెడ్డిని సత్కరించిన ఉద్యోగులు



జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డిని సత్కరిస్తున్న ఉద్యోగులు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): 8వ జీఎస్టీ దినోత్సవాన్ని వినూత్నంగా అత్యంత వైభవంగా నిర్వహించిన సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డిని ఆశాఖ ఉద్యోగులు సత్కరించారు. స్థానిక కన్నవారితోటలోని జీఎస్టీ భవన్‌లో బుధవారం సక్సెస్ మీట్ కార్యక్రమం జరిగింది. ఉద్యోగ సంఘ నాయకులు గాదె శ్రీనివాస రెడ్డి, జవహర్‌బాబు మాట్లాడుతూ జీఎస్టీ వచ్చి ఏడేళ్లయినా గుంటూరులో ఎప్పుడూ లేని విధంగా పెద్ద ఎత్తున వార్షికోత్సవాన్ని కమిషనర్ నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. సోషల్ వర్కర్లను ఆరోగ్య వీరులను గుర్తించి సత్కరించడం, ప్రతిభ చూపిన ఉద్యోగులకు, విశ్రాంత ఉద్యోగులు చేసిన సేవలకు గుర్తింపుగా ప్రశంసా పత్రాలు అందజేయడం భేష్ అన్నారు. జీఎస్టీని అత్యధికంగా కట్టిన పారిశ్రామికవేత్తలను సన్మానించడం బాగుందని పేర్కొన్నారు. అనంతరం కమిషనర్ నరసింహారెడ్డిని ఉద్యోగులు సత్కరించారు. కార్యక్రమంలో శాఖమూరి శ్రీనివాస్, బిల్లా ప్రశాంత్‌కుమార్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

- గుంటూరు ఏడీఏ సునీల్
- రూ.1.07 లక్షల విలువైన విత్తనాలు, పురుగు మందుల అమ్మకాలు నిలిపివేత



పట్నంబజారులోని ఓ షాపులో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఏడీఏ సునీల్ తదితరులు

కొరిటెపాడు(గుంటూరు): రైతులు నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల పట్ల అప్రమత్తంగా ఉండాలని గుంటూరు వ్యవసాయ సహాయ సంచాలకులు(ఏడీఏ) ఎం.సునీల్ సూచించారు. రైతులకు నాసిరకం, కల్తీ విత్తనాలు అంటగడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బుధవారం ఆయన పట్నంబజారులోని ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోడౌన్లు, రికార్డులు పరిశీలించారు. శ్రీనివాసా సీడ్స్, నాగార్జున ఎంటర్ ప్రైజెస్, వంశీ ఏజెన్సీస్ దుకాణాల్లో ప్రిన్సిపల్ సర్టిఫికెట్లు, 'ఓ' ఫారం సరిగా లేనందున రూ.21,559 విలువ గల 26.6 లీటర్ల పురుగుమందులు, రూ.85 వేల విలువైన విత్తనాల అమ్మకాలను నిలుపుదల చేశారు. వీటి విలువ మొత్తం రూ.1,06,959 ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఏడీఏ సునీల్ మాట్లాడుతూ నకిలీ విత్తనాలు, పురుగుమందులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎంఆర్‌పీ ధరలకు మించి అమ్మినా సహించబోమని వివరించారు. తనిఖీల్లో గుంటూరు అర్బన్ ఏఓ ఒ.సునీల్, గుంటూరు రూరల్ ఏఓ వి.సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

నిమ్మకాయల ధరలు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో బుధవారం క్వింటా నిమ్మ కాయల కనిష్ట ధర రూ.2,600, గరిష్ట ధర రూ.4,000, మోడల్ ధర రూ.3,400 వరకు పలికింది.

స్థానిక సంస్థల్లో ఖాళీలకు ఎన్నికలు జరపాలి



అమరావతి: రాష్ట్రంలోని స్థానిక సంస్థలలో ఖాళీగా ఉన్న సర్పంచ్, ఎంపీపీ, జడ్పీటీసీ, వార్డు మెంబర్, ఎంపీటీసీ ఖాళీలకు ఎన్నికలు నిర్వహించాలని బుధవారం ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలక్షన్ కమిషనర్ నీలం సాహ్నికి అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 117 గ్రామ పంచాయతీ సర్పంచులు, 566 వార్డు మెంబర్లు, 179 ఎంపీటీసీలు, 14 జడ్పీటీసీలు, 16 ఎంపీపీలు, 111 ఉప సర్పంచు స్థానాలు వివిధ కారణాలతో ఖాళీగా ఉన్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం 13-ఏ ప్రకారం ఈ ఖాళీలకు 120 రోజుల్లోపు ఎన్నికలు జరగాల్సి ఉందన్నారు. వివిధ కారణాల చేత నేటివరకు ఎన్నికలు జరపలేదన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎలక్షన్ కమిషన్‌ను సాధారణ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాలని కోరామన్నారు.

సొమ్ము చెల్లించకుండా వేధిస్తున్నాడు

మాచర్ల పట్టణ ఎస్ఐపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసిన దంపతులు



మాట్లాడుతున్న రామలక్ష్మమ్మ

నరసరావుపేట: రిజిస్ట్రేషన్ చేయించుకున్న భూమి తాలూకా మిగిలిన సొమ్ము చెల్లించకుండా మాచర్ల పట్టణ ఎస్ఐ గోపాల్ ఇబ్బంది పెడుతున్నాడని ప్రకాశం జిల్లా కంభం మండలం రావిపాడు గ్రామానికి చెందిన దంపతులు ముత్యాలపాటి కోట వెంకట సుబ్బయ్య, రామలక్ష్మమ్మలు చెప్పారు. బుధవారం జిల్లా ఎస్పీ మలికా గార్గ్‌ను కలిసి తమను ఇబ్బందిపెడుతున్న ఎస్ఐపై ఫిర్యాదు చేశారు. తమ కుటుంబానికి చెందిన 3.75 ఎకరాల భూమిని గతేడాది జూన్‌లో ఎస్ఐకు రూ.37 లక్షలకు విక్రయించగా అందులో రూ.24 లక్షలు చెల్లించి ఆయన భార్య వరలక్ష్మి పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడన్నారు. మిగిలిన రూ.13 లక్షల గురించి అడిగితే ఇవ్వకుండా ఇబ్బందిపెడుతున్నాడని తెలిపారు. ఆ డబ్బులు ఇప్పించి తమకు న్యాయం చేయాలని కోరారు.

కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించాలి



సమీక్షలో మాట్లాడుతున్న జేడీ డాక్టర్ దేవసాగర్

గుంటూరు మెడికల్: జూలై 18 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు జిల్లాలో కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని రాష్ట్ర కుష్ఠు నివారణ విభాగం జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దేవసాగర్ సూచించారు. బుధవారం గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలోని జిల్లా కుష్ఠు వ్యాధి నివారణ అధికారి కార్యాలయంలో కుష్ఠు వ్యాధి నిర్మూలనపై ఆయన సమీక్ష నిర్వహించారు. డాక్టర్ దేవసాగర్ మాట్లాడుతూ 'లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్‌ను 14 రోజులపాటు నిర్వహిస్తున్నామని వైద్య సిబ్బంది చిత్తశుద్ధితో విధులు నిర్వహించి వ్యాధిగ్రస్తులను గుర్తించాలని ఆదేశించారు. జిల్లాలో కుష్ఠు వ్యాధిగ్రస్తులకు అందుతున్న సేవల గురించి సిబ్బందితో చర్చించారు. గుర్తింపు ప్రక్రియపై ఆశా వర్కర్లకు, హెల్త్ అసిస్టెంట్లకు, క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించాలని డెప్యూటీ పారామెడికల్ ఆఫీసర్లను ఆదేశించారు. ప్రస్తుతం గుంటూరు జిల్లాలో 67 మంది వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు, చికిత్స అందిస్తున్నట్టు జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ దాసరి శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మానాయక్ భూక్య, పారామెడికల్ ఆఫీసర్ జె.మురళీకృష్ణ, ఫిజియోథెరపిస్ట్ కొడాలి శ్రీనివాసు, డెప్యూటీ పారామెడికల్ ఆఫీసర్స్ బసవయ్య, జోసెఫ్, నాగమల్లేశ్వరరావు, మురళీకృష్ణ, హుస్సేన్, సాంబశివరావు పాల్గొన్నారు.

మత్తులో యువకుడిపై కత్తితో దాడి



దాడిలో గాయపడిన యువకుడు కొల్లూరు ఆంజనేయ ప్రసాద్ (బుజ్జి)



దాడికి పాల్పడ్డ భరత్ (ఫైల్)

తాడేపల్లిరూరల్ : గంజాయి, మద్యం మత్తులో ఓ యువకుడు మరో యువకుడిపై కత్తితో దాడి చేసిన ఘటనపై బుధవారం తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుడు కొల్లూరు ఆంజనేయ ప్రసాద్ (బుజ్జి) కథనం ప్రకారం సీతానగరంలో ఉంటూ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న బుజ్జి మంగళవారం రాత్రి తన కారును పార్కింగ్ చేస్తుండగా అదే ప్రాంతానికి చెందిన భరత్ గంజాయి, మద్యం మత్తులో కత్తితో దాడి చేశాడు. గతంలో భరత్ దొంగనోట్ల మార్పిడి, దారిదోపిడీ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. ఇటీవల భరత్ రూప అనే మహిళపైనా దాడి చేసినట్టు సమాచారం. గతంలో భరత్ ఆగడాలపై పోలీసులను ఆశ్రయించినా పట్టించుకోలేదని, ఇప్పటికైనా కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఇదిలా ఉంటే భరత్ మద్యం మాత్రమే తాగుతాడని, గంజాయి సేవించడమని అతడి బంధువులు చెబుతున్నారు.

పీహెచ్‌సీ వైద్యురాలిపై విచారణ

- ఆసుపత్రి సిబ్బందిని పలురకాలుగా వేధిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓకు ఫిర్యాదు
- క్షేత్రస్థాయి విచారణకు విచ్చేసిన ఉన్నతాధికారులు



ఆస్పత్రి సిబ్బందిని విచారిస్తున్న విచారణ బృందం

క్రోసూరు: క్రోసూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యురాలు డాక్టర్ ఎన్.బాల అంకమ్మబాయి, ఆసుపత్రి స్టాఫ్(ఏఎన్ఎంలు, ఆశ, ఉద్యోగులు)కు గత కొద్దికాలంలో విబేధాలు ఉంటున్నాయి. ఈ క్రమంలో ఆసుపత్రి సిబ్బంది మొత్తం గత సోమవారం పల్నాడు జిల్లా వైద్యాధికారి బి.రవికి పీహెచ్‌సీ వైద్యురాలిపై పలు ఆరోపణలు చేస్తూ ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో డీహెంహెచ్‌ఓ ఆదేశాల మేరకు బుధవారం జిల్లా టీబీ అధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ, స్టాటిస్టికల్ అసిస్టెంట్ నీలకంఠేశ్వరరావు క్షేత్రస్థాయిలో విచారించేందుకు పీహెచ్‌సీకి వచ్చారు. వైద్యురాలితో, అదేవిధంగా ఆసుపత్రి సిబ్బంది, కొంత మంది రోగులతో విడివిడిగా విచారించారు. ఆసుపత్రి సిబ్బందికి మద్దతుగా ఏపీఎన్‌జీఓల సంఘం ప్రతినిధులు కూడా హాజరయ్యారు. పూర్తి వివరాలు తీసుకున్న విచారణ అధికారి తన నివేదికను జిల్లా అధికారులకు అందజేస్తానని తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్టు టెండరు నోటీసు

ఆర్.ఓ.సి.నెం.1151/2024/ఇ1 తేది.03-07-2024
నిట్ నెం: 05/జే.టి.ఓ/2024-25

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ సాధారణ నిధుల క్రింద ఈ దిగువ ఉదహరించిన పనులకు ఈ దిగువ ఉదహరించిన తేదీల యందు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండరు పిలువబడినది.

మొత్తము పనులు: 04 నెం.	అంచనా వ్యయము రూ. 35.65 లక్షలు
పని నెం: 01 నుండి 04 లకు :	
1 టెండరు షెడ్యూల్ డౌన్‌లోడ్ కొరకు నిర్ణయించిన ప్రారంభ తేది.	ది.04-07-2024 ఉ॥ 11.00 గం.ల నుండి
2 టెండరు షెడ్యూల్ డౌన్‌లోడ్ కొరకు నిర్ణయించిన చివరి తేది	ది.08-07-2024 ఉ॥ 11.00 గం.ల వరకు
3 ప్రైస్ బిడ్ తెరచు తేది.	ది.08-07-2024 మ॥02.00 గం.లకు

మిగతా వివరములకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ http://www.apeprocurement.gov.in చూడగలరు. మొబైల్ నెం. 98499 07303

సం/- కమీషనరు, మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ Join B.Com Comp App Learn Tally, B.A Economi CS or His Story or Special English Learn MS Office in First 2 Sems Free Limited Seats.PLNM College. ✆ 9177408565

■ Join B.Sc Com Sci Learn Python, Join B.Sc Electronics Learn Basics of Cmosvlsi in First 2 Sems Free. Limited Seats. PLNM College.opp:ANU✆ 9177408565

■ Exams Aug-2024 B.Tech, M.Tech, MBA, MCA, MSc, BBA, BCA, B.Com, B.Sc, BA, B.Sc(Agriculture), BPT, DMLT B.Sc(MLT). Contact: 7386406839

WANTED

■ Wanted Female Campus Incharges Qualification Any Degree/B.Tech. Must be Married. Age: 30+, place of work, Guntur. Salary Upto 15,000/- Master Minds. 3/11, Brodipet, Guntur. Contact: 9100024059

■ ఇంట్లో పనిచేయుటకు పనిమనిషి కావలెను. సంప్ర: 9949284105

■ Wanted Faculty: DSC+TET faculty for English, Psychology, Methodologies and 3 to 10 Std content teachers & AO, Inhcarge and Receptionist. Apple Competative Academy, 4/13, Brodipet, near Vajram Hotel, Guntur ✆ 9652976113, 7013620244

■ నిరుద్యోగ యువతీ యువకులకు గుంటూరు, విజయవాడ, Hydలో అన్ని రంగాలలో ఉద్యోగ అవకాశములు కలవు. అ:10th,ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్,మంచిజీతం,PF,ESIకలదు. ✆9493881531

■ గుంటూరులోని ప్రముఖ కంపెనీకి కారు డ్రైవర్ కావలెను. కనీసం 10 సం.ల అనుభవం కలిగి హై ఎండ్ కారు నడపగల డ్రైవర్ కావలెను. 9133399258, 8341047069

■ 10th, ఇంటర్, డిగ్రీ, B.Tech చదివి ఖాళీగా ఉంటున్నవారికి ఆఫీసులు, షోరూమ్‌లు, షాపింగ్ మాల్స్ Ltd కంపెనీల్లో మా సంస్థ ద్వారా ప్లేస్‌మెంట్స్ కలవు. ట్రస్ట్ ఆఫీస్ వర్క్స్. 99632 55441

■ మా సంస్థ నందు పార్ట్‌టైమ్/ఫుల్ టైమ్ వర్క్ చేయుటకు యువతి/యువకులు కావలెను. ఆకర్షణీయమైన సంపాదన. సంప్ర:॥ 7082856389

■ Wanted Teachers for KG to 5th, P.E.T, incharges, classical & study hours teachers. Fluency in English is must. Montessori Schools GNT ✆ 6305028254

■ గుంటూరు హోమ్ కేర్ సర్వీసెస్, శ్రేమంతుల ఇళ్ళల్లో పనిచేయుటకు పెద్దవారిని, పెషంట్లను చూసుకోను టకు వర్కర్స్ 24/7 కావలెను. రూం+భోజనం ఫ్రీ. జీ:15000-18000 ✆8121555036, 8121555026

■ Wanted Male Academic Principals Qualification Any Degree / P.G, Age limit: 30 to 45years, Salary: 30,000/- to 35000/- working location: Guntur. Contact: 92487 33312

■ రొయ్యల కంపెనీలో ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్ మచిలీపట్నం,గుడివాడ, రేపల్లె, చీరాల, ఒంగోలులో స్టాఫ్ కావలెను. అర్హత:Dip/B.Tech. జీతం: 13k-15k. 9115456456, 9347017891

■ ప్రముఖ కంపెనీలో వర్క్ ఫ్రం హోం వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం 15-28 వేలు. కాల్/ వాట్సప్ చేయగలరు. సంప్ర. సెల్ : 95026 15217

■ ప్రముఖ సెక్యూరిటీ సంస్థ నందు పని చేయుటకు ఫీల్డ్ ఆఫీసర్స్, సెక్యూరిటీ గార్డ్స్, హౌస్ కీపింగ్, స్త్రీ & పురుషులు కావలెను. ✆ 80085 45666, 9989535178.

■ సిమెంట్ ఫ్యాక్టరీలో సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం, రూం ఫ్రీ, అతి తక్కువ రేటులో భోజనం. సంప్ర:॥ దాచేపల్లి, సెల్: 8464835928, 6304488636

■ గుంటూరులోని రాజుపురం ఏరియాలో సెక్యూరిటీ గార్డ్స్ (జెంట్స్) అర్జెంటుగా కావలెను. 8 గంటల డ్యూటీ జీతం-10,700/- PF, ESI కలదు Q:10th pass Age:50 Years Below ✆ 96761 07661

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ : 18K సంప్ర : 9640256899, 9640468899

■ డ్వాక్రామహిళలకు, నిరుద్యోగులకు, ఇంట్లో ఉంటూ పెట్టుబడి మీరే పెట్టుకొనేకొవ్వొత్తులు, పెన్సిల్స్ తయారుచేసి మాకు ఇవ్వండి. గ్రూపులకు ఉచిత శిక్షణ. 9491995565

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్ లో పని చేయుటకు లేడీ సూపర్ వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, భార్యాభర్తలు కావలెను. 9391036931, 9246585901

ఈ పేజీలో ప్రకటనల కొరకు సంప్రదించండి
గుంటూరు
7075167541
7075167663

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.